# జాతీయవాద చింతన
# వలసవాద ప్రపంచం

ఆంగ్ల మూలం

పార్థ చటర్జీ

తెలుగు సేత

కాకాని చక్రపాణి

ఎమెస్కో

# విషయసూచిక


| | | |
|---|---|---|
| | ముందుమాట | ix |
| 1. | రాజకీయ భావాల చరిత్రలో ఒక సమస్యగా జాతీయవాదం | 1 |
| 2. | వస్తు సంబంధ సమస్యాత్మకమైన విషయాలు | 59 |
| 3. | నిర్గమన సందర్భం : బంకించంద్రుని చింతనలో సంస్కృతి-శక్తి | 88 |
| 4. | తంత్రాల యుగం: గాంధీ, పౌరసమాజపు విమర్శ | 140 |
| 5. | ఆగమన సందర్భం: నెహ్రూ నిష్క్రియాత్మక విప్లవం | 216 |
| 6. | హేతు చతురత | 276 |

# 1. రాజకీయ భావాల చరిత్రలో ఒక సమస్యగా జాతీయవాదం

ఇంతకుముందు తగిన మేరకు చర్చించి వదిలేసిన విషయాన్ని గురించి మళ్లీ పట్టించుకుని చర్చించ పూనడం అనవసరం; అది అజ్ఞాన ఫలితంగా లేక దుష్టబుద్ధికి సంకేతంగా మాత్రమే జరుగుతుంది.

– అబు బాకర్ ముహమ్మద్ ఇబ్న్ బజ్జా (అవెంపేస్)
*తబ్దీర్ అల్–ముతవహ్హిద్*

## I

**అం**తగా ప్రఖ్యాతం కాని ఒక వ్యాసంలో, జాన్ ప్లమెనాట్జ్ (John Plamenatz) 'రెండు రకాల' జాతీయవాదం గురించి చెప్పాడు.[1] రెండింటిలోనూ, జాతీయత ప్రాథమికంగా ఒక 'సాంస్కృతిక అంశం'. అయితే, ఇది 'రాజకీయరూపం' ధరించవచ్చు. ఒకరకం 'పశ్చిమా'నికి చెందినది; ఇది పశ్చిమ యూరప్‌లో ప్రభవించింది, రెండవది 'తూర్పు'కు చెందింది; ఇది తూర్పు యూరపు, ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలలో పుట్టింది. ఓ ప్రత్యేక జాతీయ సంస్కృతి అభివృద్ధి చెందిన స్థితిని ఏఏ ఉమ్మడి ప్రమాణాల ద్వారా కొలవటం జరుగుతుందో, వాటి స్వీకృతిపై ఈ రెండు రకాల జాతీయవాదం ఆధారపడి ఉంటుంది. అయితే, మొదటి రకంలో, ఇతర దేశాలతో పోలిస్తే తమ దేశం అననుకూలతను ఎదుర్కొంటున్నది అన్న భావం నెలకొని ఉన్నప్పటికీ, ఆ లోపాలను తొలగించే ప్రయత్నం చెయ్యటంలో అది అప్పటికే 'సాంస్కృతికంగా సిద్ధమై ఉంది'. అలా, ప్రగతికి సంబంధించిన కొత్త ప్రపంచ ప్రమాణాలను ఫ్రాన్సు లేక బ్రిటను మిగిలిన ప్రపంచానికి సిద్ధం చేసి

పెట్టినప్పటికీ, అవి 'మనిషి, నైతికత, సమాజం' లాంటి కొన్ని భావాలపై ఆధారపడి ఉన్నాయి; ఈ భావాలు సాధారణంగా, పశ్చిమ ఐరోపా సామాజిక, మేధాపర మూలాలలో పాదుకొని ఉన్నాయి. బ్రిటను, ఫ్రాన్సు సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ గతిని నిర్ధారించినవయి ఉండవచ్చును; ఆ కారణంగా అవి ప్రశంసకూ, విమర్శకూ కూడా గురియై ఉండవచ్చును. అయితే, అవి ప్రపంచనాయక దేశాలుగా ప్రభవించే క్రమంతోపాటే, 'మిగతా అన్నిదేశాల కంటే ముందుగానే ఆలోచించటం నేర్చుకున్న' పశ్చిమ ఐరోపాలో 'భిన్నదేశాల మధ్య సౌమరస్యం' కూడా ప్రభవించింది; ఫలితంగా పశ్చిమంలోని ఇతర దేశాలలో జాతీయత ప్రభవించినప్పుడే – అది గతిని నిర్ధారించిన వారి ప్రగతి ప్రమాణాల విషయంలో తాము వెనకబడి ఉన్నామన్న అననుకూల భావజన్యమైనా – ఆ ప్రమాణాలను చేరుకోవటానికి తాము ప్రయత్నం చెయ్యడానికి సాంస్కృతికంగా సిద్ధంగా లేమన్న భావన ఏ దేశంలోనూ లేదు. ఉదాహరణకు జర్మన్లను లేక ఇటాలియన్లనే తీసుకుంటే, వాళ్లకప్పటికే తగిన భాషాపర, విద్యాపర, వృత్తిపర నైపుణ్యాలు ఒనగూడి ఉన్నాయి. 'జ్ఞాత ప్రగతిశీల నాగరికత'కు అవసరమని భావించిన లక్షణాలు అవి. కనుక, 'తమకు విదేశీయమైన దానిని సొంతం చేసుకోవటం ద్వారా సాంస్కృతికంగా వారు సిద్ధ పడాల్సిందేమీ లేదు.' అంటే, ప్రగతికి సంబంధించిన విశ్వజనీన ప్రమాణాల స్వీకృతి ఓ అననుకూల చేతనను కలిగించినప్పటికీ, ఏ మౌలిక రూపంలోనూ ఆ విశ్వజనీన ప్రమాణాన్నే జాతీయసంస్కృతికి పరాయిదిగా, భిన్నమైనదిగా పరిగణించటం జరగలేదు.

అందుకు భిన్నంగా, 'తూర్పు' దేశాల జాతీయత 'తమకింతకుముందు దాకా పరాయిదయిన నాగరికతలోకి ఇటీవల ప్రజలను తీసుకువెళ్లటం'గా పరిణమించింది. 'నిరంతరం ప్రబలమయ్యే విశ్వజనీన ప్రమాణాలు వీరి ప్రాచీన సంస్కృతులను విజయం, ఉత్కృష్టతల దిశగా నడిపించలేదు.' ఈ దేశాలు కూడా, పశ్చిమయూరప్‌లోని అభివృద్ధి చెందిన దేశాలు సిద్ధం చేసిన కొన్ని ప్రపంచ ప్రమాణాల పరిభాషలోనే తమ వెనుకబాటు తనాన్ని లెక్కవేసుకున్నాయి. అయితే, ఇక్కడ స్పష్టంగా గుర్తించాల్సిన విషయమేమంటే, ఈ ప్రమాణాలు ఒక పరాయి సంస్కృతి నుండి వచ్చినవన్న, ఆ ప్రగతి ప్రమాణాలను చేరటానికి అనువైన పొందికను వారసత్వంగా సంక్రమించిన సంస్కృతి తమకు కల్గించలేదన్న ఓ ప్రాథమిక భావన ఇక్కడ జాగృతమయ్యే ఉంది. ఫలితంగా, 'తూర్పు' దేశాల జాతీయవాదంలో దేశాన్ని సాంస్కృతికంగా 'తిరిగి–సిద్ధం' చేసే ప్రయత్నం, రూపుదిద్దే ప్రయత్నం చేరి ఉన్నది. అయితే, ఆ పని పరాయి సంస్కృతిని

అనుకరించటం వల్ల మాత్రమే సిద్ధించదు. అప్పుడు, ఆ దేశం తన స్వీయ గుర్తింపును పోగొట్టుకుంటుంది. కనుక శోధన జాతీయ సంస్కృతి పునరుత్పత్తి దిశగా జరగాలి; ప్రగతి అవసరాలకు అనుగుణంగా జరగాలి; అదే సమయంలో తన స్వీయ లక్షణాన్నీ, స్వభావాన్నీ కోల్పోకూడదు.

ప్రయత్నం చాలా వైరుధ్యంతో కూడుకున్నది; 'ఇది అనుకరించేదీ, తను అనుకరించే నమూనాలను వ్యతిరేకించేదీ – రెండూనూ...' ఒక పరాయి సంస్కృతి సిద్ధం చేసిన ప్రమాణాల విలువలను స్వీకరించటం వల్ల ఇది అనుకరిస్తుంది. అయితే, ఇందులో తిరస్కరణ కూడా ఉన్నది; 'నిజానికి, రెండు తిరస్కరణలున్నాయి. అవి రెండూ కూడా ద్వైధీభావం కలిగినవి: ఒక పరాయి దురాక్రమణదారుడు, అణచివేతదారుడి తిరస్కరణ; అయితే, అతడిని అనుకరించక తప్పదు; అతడి ప్రమాణాల ద్వారా తాను అధిగమించాలి; తన ప్రాచీన మార్గాల పద్ధతులను తిరస్కరించాలి; వాటిని ప్రగతిలో అడ్డంకిగా చూపడం జరుగుతుంది; అయినా గుర్తింపు చిహ్నాలుగా వాటిని ఆదరించక తప్పదు.' కనుక ఈ వైరుధ్య క్రమం ఎంతో మానసిక అశాంతిని కలుగజేస్తుంది. 'హెర్డర్ (Herder), మజ్జినీ (Mazzini) ల జాతీయతలు ద్వైధీభావాన్నీ, మానసిక అశాంతినీ రేకెత్తించవు; అందుకు భిన్నం తూర్పు జాతీయత.'

ప్లమనాట్జ్ రాసిన ఇతర గ్రంథాల వలె కాక, ఈ వ్యాసం అంత తీవ్రమైన వాదం చేసేదీ కాదు, అంత లోతయినదీ కాదు. అయితే, రెండు రకాల జాతీయతల మధ్య భేదం చెప్పేటప్పుడు, జాతీయవాద చింతనను గురించి చెప్పుకునేటప్పుడు ఉదార–హేతువాద సందిగ్ధత అని పిల్చే ఆధారాంశాల గూర్చి తగిన స్పష్టత నందిస్తుంది. జాతీయత గూర్చిన ప్రామాణిక ఉదార చరిత్రలలోనూ ఇదే సందిగ్ధత వ్యక్తమవుతుంది; ముఖ్యంగా ఇది హాన్స్ కోన్ (Hans Kohn) గ్రంథంలో స్పష్టంగా కన్పిస్తుంది.[2] స్వేచ్ఛను గూర్చిన గాథలో అవిభక్త అంగంగా జాతీయతను చరిత్రరచన అంగీకరిస్తుంది. విశ్వచరిత్ర జననంతో దీని మూలాలు సమకాలికం; పారిశ్రామికీకరణ, ప్రజాస్వామ్యాల ప్రాదుర్భావాన్ని చూసిన చారిత్రక క్రమాలు దాని వికాసంలో భాగమవుతాయి. కనుక, ముఖ్య అంశాల్లో, స్వేచ్ఛ, ప్రగతుల కోసమయిన విశ్వజనీన కోరికలను రాజకీయ పరిభాషలో వాస్తవం చేసే ప్రయత్నానికే జాతీయత ప్రాతినిధ్యమిస్తుంది. అయితే, అర్థంలేని ప్రాంతీయవాదానికీ, విదేశీవస్తు వైమనస్యానికీ ఇది చోటు కల్పించటం కూడ కాదనలేని వాస్తవం; ఆ కారణంగా వ్యవస్థీకృత హింస, నియంతృత్వాలకు సమర్థనగా కూడా పనిచేస్తుంది. స్వేచ్ఛా గాథలో భాగంగా